క్లుప్తంగా

కల్లూరులో 104 వైద్య శిబిరం

దొరవారిసత్రం: మండలంలోని కల్లూరులో బుధవారం 104 వాహనం ద్వారా వైద్య శిబిరం నిర్వహించి రోగులకు వైద్య సేవలందించారు. సాధారణ జబ్బులతో పాటు దీర్ఘకాలిక రోగాలైన బీపీ, షుగర్ తదితర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో తొగరాముడి పీహెచ్‌సీ వైద్యాధికారి తరుణ్‌సాయి పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు తప్పనిసరి

రాపూరు: గర్భిణులు క్రమంతప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వేపినాపి పీహెచ్‌సీ వైద్యులు సూర్యధర్మేంద్ర తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య, రక్త పరీక్షలు చేసి ఐరన్ తక్కువగా ఉన్న వారికి మాత్రలు అందజేస్తున్నట్లు తెలిపారు.

ఆక్రమణలో క్రీడా మైదానం

సైదాపురం: మండలంలోని మర్లపూడి ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని ఆక్రమిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వరద బండి ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. మర్లపూడి ఉన్నత పాఠశాల క్రీడా మైదానం 2021లో ఆక్రమణకు గురైందని, దీనిపై జెడ్పీ సీఈవో ఆదేశాల మేరకు 2022 డిసెంబర్ 24న ఆక్రమణలను తొలగించినట్లు తెలిపారు. నేడు మళ్లీ క్రీడామైదానాన్ని ఆక్రమించుకుని పక్కా భవనాలు నిర్మిస్తున్నారని ఆరోపించారు.

లింగసముద్రం ఎంపీటీసీ రాజీనామా



రాజీనామా పత్రం అందజేస్తున్న నావూరు కోటేశ్వరయ్య

దక్కిలి: మండలంలోని లింగసముద్రం ఎంపీటీసీ నావూరు కోటేశ్వరయ్య తన పదవికి బుధవారం రాజీనామా చేశారు. రాజీనామాను బుధవారం సూపరింటెండెంట్ అనురాధ, ఈవోపీఆర్డీ అల్లాబక్షుకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ తన కుటుంబ పరిస్థితులు, వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు తెలిపారు. రాజీనామాను ఆమోదించాలని కోరారు. సూపరింటెండెంట్ అనూరాధ రాజీనామా పత్రాన్ని జెడ్పీ సీఈవోకు మెయిల్ ద్వారా పంపించారు.

రోడ్లు తవ్విన చోట్ల పటిష్ట మరమ్మతులు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో గ్యాస్ పైపులైన్ కోసం సిమెంట్ రోడ్లు తవ్విన చోటమరమ్మతు పనులు చేయాల్సిందేనని కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో పలుచోట్ల తవ్వకాలు చేపట్టారని, ఆ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి తవ్వినచోట పటిష్టంగా మరమ్మతులు చేయాలని కోరామన్నారు. లేనిపక్షంలో డిపాజిట్ చేసిన రూ.5 కోట్లను తిరిగి ఇవ్వబోమని స్పష్టం చేసినట్లు వెల్లడించారు.

హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ

నాయుడుపేట టౌన్: మండలంలోని విన్నమాలలో బుధవారం హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పొదుపు సంఘాల మహిళలకు అవగాహన కల్పించారు. స్థానిక నవజీవన్ ఆర్గనైజేషన్ ప్రాజెక్టు మేనేజర్ బాలాజీ మాట్లాడుతూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌కు మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమన్నారు. అనంతరం మహిళలతో కలిసి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఓఆర్‌డబ్ల్యూ టి.శ్రావణి, ఎం.సాయిలక్ష్మీ, ఏఎన్‌ఎం జి.హరిత పాల్గొన్నారు.

వీవోఏల నిరసన

వెంకటగిరి రూరల్: వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్నారని పేర్కొంటూ కూటమి ప్రభుత్వం తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని బాలాయపల్లి మండలానికి చెందిన వీవోఏలు ఆరోపించారు. వారు బుధవారం షెడ్యూల్డ్ క్యాస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ నాగిశెట్టి ధర్మయ్య ఆధ్వర్యంలో వెంకటగిరి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ధర్మయ్య మాట్లాడుతూ ఇరుగువాణి, గంప మాధవి, హజరత్నమ్మ రెండేళ్లుగా బాలాయపల్లి మండలంలో వీవోఏలుగా పనిచేస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా పనిచేశారని ఆరోపిస్తూ నోటీసులు ఇవ్వకుండానే విధుల నుంచి పక్కన పెట్టారని దుయ్యబట్టారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

సూళ్లూరుపేట రూరల్: పేర్నాడు పీహెచ్‌సీ పరిధిలోని మన్నేముత్తేరి పంచాయతీలో బుధవారం స్విమ్స్, బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు వైద్యాధికారి ఎస్.రమణయ్య తెలిపారు. పురుషులతో పాటు 40 ఏళ్లు పైబడిన మహిళలందరూ తప్పనిసరిగా నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వారం క్యాన్సర్ పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ హరిత, సర్పంచ్ చిన్నరాజా తదితరులు పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న కన్నాకాలువ

సమృద్ధిగా పంటలు పండితేనే ప్రజలు బాగుంటారు. తద్వారా రాజ్యం సుభిక్షంగా ఉంటుంది. అందుకే పూర్వం రాజులు చెరువులను తవ్వించారు. వాటికి నీటిని తీసుకెళ్లేందుకు కాలువలు, సప్లయ్ చానళ్లను ఏర్పాటుచేశారు. వీటిద్వారా కొండలు, గుట్టలు, ఎగువ ప్రాంతాల నుంచి నీరు చెరువులకు చేరి రైతులు పంటలు పండించుకుంటున్నారు. నేటి పాలకులు సప్లయి చానళ్ల అభివృద్ధి గురించి పట్టించుకోకపోవడంతో కనుమరుగవుతున్నాయి. చెరువుల్లోకి నీరు రాకపోవడంతో ఆయకట్టు భూములు బీళ్లుగా మారుతున్నాయి. దొరవారిసత్రం, నాయుడుపేట మండల వాసులకు వరప్రసాదిని అయిన కన్నాకాలువను బాగు చేయాలని రైతులు కోరుతున్నారు.



కొత్తపల్లి గ్రామ సమీపంలో కన్నాకాలువ దుస్థితి



పూలతోట వద్ద కాలువ పరిస్థితి

- ఏపుగా పెరిగిన ముళ్లపొదలు
- అభివృద్ధి చేస్తే వేల ఎకరాలకు సాగునీరు
- పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

దొరవారిసత్రం: దొరవారిసత్రం, నాయుడుపేట మండల ప్రాంతాల్లోని వివిధ గ్రామాల రైతులకు వరప్రసాదిని కన్నాకాలువ. ఇది నాయుడుపేట మండలం పూడేరు ప్రాంతంలో పుట్టి దొరవారి సత్రం మండలం రామరెడ్డికండ్రిగ, కొత్తపల్లి, పూలతోట, సింగనాలత్తూరు, మేలనాలత్తూరు, చవటకండ్రిగ, కట్టువాలపల్లి గ్రామాల వరకు 12 కిమీటర్ల మేర విస్తరించి ఉంది. దీని ద్వారా ఇరిగేషన్, పీఆర్‌శాఖ పరిధిలోని 25 చెరువుల్లోకి నీరు చేరుతుంది. తద్వారా రెండు మండలాల్లోనూ 3500 నుంచి 4000 ఎకరాల భూములకు సాగునీరు అందుతుంది. పలు గ్రామాల రైతులు మోటార్లు పెట్టుకుని పంటలకు నీటిని వినియోగించుకుంటారు. పూలతోట ప్రాంతంలో కన్నాకాలువపై చెక్ డ్యామ్ నిర్మించారు. ఇక్కడి నుంచి కట్టువాపల్లి, ఆనేగొట్టు, సింగనాలత్తూరు, మేలనాలత్తూరు, చవటకండ్రిగ తదితర గ్రామాల్లోని చెరువుల్లో నీరు చేరేలా సప్లయ్ చానల్స్ కూడా ఉన్నాయి. ఈ కాలువ ముళ్లపొదలతో కనిపించకుండా పోయింది. దీని పరిధిలో ఉన్న సప్లయ్ చానళ్లు కూడా దెబ్బతిన్నాయి. దీంతో వర్షాలు కురిసినా చెరువులకు నీరు చేయడం రైతులు వాపోతున్నారు.

2016–17లో రూ.లక్షలు స్వాహా

డీవీ సత్రం మండలంలో విస్తరించి ఉన్న 7 కిలోమీటర్లు కన్నాకాలువ అభివృద్ధికి 2016–17లో నీరు–చెట్టు కింద రూ.50 లక్షలు మంజూరయ్యాయి. తెలుగు తమ్ముళ్లు తూతూమంత్రంగా గా పనులు చేసి రూ.లక్షలు స్వాహా చేశారు. అధికారులు కూడా చూసీచూడనట్టు వ్యవహరించారనే ఆరోపణలు వినిపించాయి.

కన్నాకాలువ చాలా దారుణంగా ఉంది



కొత్తపల్లి గ్రామ ప్రాంతంలో కన్నాకాలువ చాలా దారుణంగా ఉంది. కాలువ స్వరూపం కోల్పోయి పార్లు కట్ట లేకుండా పోయింది. వర్షాలు కురిసినా నీరు కాలువ ద్వారా చెరువుల్లో చేరే పరిస్థితి లేదు. గతంలో టీడీపీ వాళ్లు తూతూమంత్రంగా పనులు చేసి నిధులు స్వాహా చేశారు.

– జి.నాగూరయ్య, సర్పంచ్, కొత్తపల్లి పంచాయతీ

కాలువ రూపురేఖలే లేవు



పలు చోట్ల కన్నాకాలువ రూపురేఖలు కూడా కనిపించడం లేదు. కొన్ని చోట్ల కాలువ పూర్తిగా పూడిపోయింది. పూడిక తీసి పార్లు కట్టను అభివృద్ధి చేస్తేగాని చెరువులకు నీరు చేరదు. దీని గురించి అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పట్టించుకుని అభివృద్ధి చేయాలి.

– బాలయ్య, రైతు, చవటకండ్రిగ గ్రామం

రూ.7 కోట్లతో ప్రతిపాదనలు

డీవీ సత్రం మండలంలోని కన్నాకాలువ అభివృద్ధికి రూ.7 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే పూడికతీత, పార్లు కట్ట, తూములు ఏర్పాటు, సప్లయ్ చానల్స్ అభివృద్ధి పనులు చేస్తాం. ఈకాలువ ద్వారా డీవీ సత్రం మండలంలోనే 15 చెరువులకు నీరు చేరుతుంది. 2500 ఎకరాల్లో పంటలు పండుతాయి.

– హరికృష్ణ, ఏఈ ఇరిగేషన్ శాఖ, డీవీ సత్రం

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

గూడూరు రూరల్: తపాలా వారోత్సవాల్లో భాగంగా గురువారం నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు గూడూరు తపాలా శాఖ సూపరింటెండెంట్ జాఫర్ సాదిక్ తెలిపారు. ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, ఫోన్ నంబర్ లింక్ తదితరాలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. గూడూరు రూరల్ పరిధిలోని విందూరు, చేజర్ల, పొదలకూరు, తడ పోస్టల్ కార్యాలయాల్లో క్యాంపులు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.

సిబ్బందికి సన్మానం



సిబ్బందిని సత్కరిస్తున్న షేక్ రియాజ్ అహ్మద్

గూడూరు రూరల్: గూడూరు డివిజన్ పంచాయతీ రాజ్ కార్యాలయంలో పని చేస్తూ బదిలీపై వెళుతున్న సిబ్బంది, నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారిని బుధవారం డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ గూడూరు డివిజన్‌లోని ఇంజినీరింగ్ డిపార్టుమెంట్‌లో పని చేసే వారికి మంచి గుర్తిపు ఉందన్నారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న వారు కూడా బాగా పనిచేసి మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవీంద్రబాబు, డీఈఈ శ్రీనివాసరావు, నాయుడుపేట డీఈఈ రమణయ్య, డీఈలు క్రిష్ణబాబు, రామచంద్రయ్య, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, ఇలియాజ్ అహ్మద్, కిరణ్ పాల్గొన్నారు.

నాయుడుపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 130 దరఖాస్తులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పరిధిలో 17 ప్రైవేటు మద్యం షాపులకు బుధవారం సాయంత్రానికి 130 దరఖాస్తులు అందినట్లు సీఐ ఇండ్ల అరుణకుమారి వెల్లడించారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ నాయుడుపేట మున్సిపాలిటీలో 13 మద్యం షాపులు మంజూరయ్యాయని, వాటికి 59 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఓజిలిలో 2 మద్యం షాపులకు 44 దరఖాస్తులు, పెళ్లకూరులో 2 షాపులకు 27 దరఖాస్తులు అందాయన్నారు. అలాగే ఈ నెల 11వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు తెలిపారు. 12న దరఖాస్తుల పరిశీలన, 14న లక్కీడ్రాలో దుకాణాల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. 16 నుంచి మద్యం విక్రయాలు ప్రారంభమవుతాయని చెప్పారు.

మినీ లారీ బోల్తా



అదుపు తప్పి బోల్తాపడిన లారీ

చిల్లకూరు: మండలంలోని వరగలి క్రాస్ రోడ్డు వద్ద బుధవారం మినీ లారీ బోల్తాపడింది. దీంతో సుమారు గంటకు పైగా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసుల కథనం మేరకు.. మినీ లారీ లోడుతో చెన్నై నుంచి నెల్లూరు వెళుతోంది. వరగలి క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండడంతో వన్ వే ఏర్పాటు చేశారు. వాహనాలు ఒకదాని తరువాత ఒకటి వెళ్లేలా బారికేడ్లు పెట్టారు. మినీ లారీ డ్రైవర్ వేగంగా వచ్చి ఒక్క సారిగా మలుపు తిరిగేందుకు ప్రయత్నించడంతో లారీ బోల్తా పడింది. రోడ్డుకు అడ్డంగా లారీ నిలిచిపోవడంతో నాయుడుపేట వైపు నుంచి వచ్చే వాహనాలు బారులు తీరాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని క్రేన్ సాయంతో లారీని తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ప్రమాదంలో ఎవరికి గాయాలు కాక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కేసు నమోదు విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు



నిరసన తెలుపుతున్న జెడ్పీటీసీ, రైతులు

చిల్లకూరు: కూటమి ప్రభుత్వంలో యథేచ్ఛగా మట్టి, గ్రావెల్ తవ్వకాలు చేపట్టి చెరువులు, బీడు భూములను గుల్ల చేస్తున్నారని చిల్లకూరు జెడ్పీటీసీ మన్నెం శీనయ్య ఆరోపించారు. మండలంలోని ముత్యాలపాడు పంచాయతీ సంద్రగుంట చెరువులో అనుమతి లేకుండా మట్టిని తవ్వుతుండడంతో ఆయన బుధవారం రైతులతో కలిసి వాహనాలను అడ్డుకున్నారు. ఆయన మాట్లాడుతూ సంద్రగుంట చెరువు కింద సుమారు 22 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయని తెలిపారు. సాగరమాల రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లు స్థానిక టీడీపీ నాయకులతో కలిసి అనుమతులు లేకుండా చెరువులో మట్టిని తవ్వుతున్నారని తెలిపారు. దీంతో వర్షం కురిసిన సమయంలో గుంతల్లో మాత్రమే నీరు నిలుస్తుందని, ఆయకట్టు బీడుగా మారుతుందని వాపోయారు. దీనిపై పలుమార్లు రైతులు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు.

వరిలో విత్తన శుద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి

కోట: మండలంలోని చెందోడు, చంద్రశేఖరపురంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఏవో నిరంజన్‌కుమార్ రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగించారు. వరిలో విత్తనశుద్ధి ప్రాముఖ్యతను వివరించారు. రబీ సీజన్‌కు అవసరమయ్యే వరి వంగడాలు, వాటి రకాలు, లభ్యతను తెలియజేశారు. సూక్ష్మ పోషకాలైన జింక్, జిప్సం ఆవశ్యకతను వివరించారు.

క్రీడా ప్రాంగణంలో బెంచీల ఏర్పాటు



బెంచీలు ఏర్పాటు చేస్తున్న సంస్థ ప్రతినిధులు

గూడూరు రూరల్: గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో బుధవారం వాకర్స్ కోసం బెంచీలు ఏర్పాటు చేశారు. ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ క్రీడా ప్రాంగణంలో వాకర్స్‌తోపాటు స్థానికులు కూర్చునేందుకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే బెంచీలు ఏర్పాటుకు మల్లి వెంకటేశ్వర్లు అనే దాత ముందుకు వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ఎం.రాధయ్య, రాము, సురేష్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, పిల్లెల శ్రీను, రామక్రిష్ణ, నాగేంద్ర, క్రిష్టారెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

టెట్‌కు 18 మంది గైర్హాజరు

కోట: మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలోని సెంటర్‌లో బుధవారం జరిగిన టెట్ పరీక్షకు 16 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో, పరీక్షల పర్యవేక్షణాధికారి నజీంఆలి తెలిపారు. 70 మంది హాజరుకావాల్సి ఉండగా 61 మంది హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం పరీక్షకు 70 మందికి గాను 61 మంది హాజరైనట్టు పేర్కొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందజేస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్, జేవీవీ సభ్యులు

గూడూరు రూరల్: గూడూరు ఏరియా ఆస్పత్రిలోని మాతా శిశు కేంద్రంలో బుధవారం గర్భిణులు, బాలింతలకు జేవీవీ ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా మాట్లాడుతూ జేవీవీ నాయకులు పదేళ్లుగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నారని కొనియాడారు. గర్భిణులు ఏడో నెలలో ఆధార్ కార్డు తీసుకుని వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం జరిగిన వెంటనే ఆమెకు ప్రభుత్వం ద్వారా రూ.5 వేలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచునారాయణ, పురుషోత్తమరావు, రాధయ్య, గజదీష్, సుబ్బారావు, సుబ్రమణ్యం, సుమన్‌రెడ్డి, ప్రసాద్, పాలేటి విజయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజశేఖర్

దక్కిలి: సీజనల్ వ్యాధులపై వైద్య, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ గోను రాజశేఖర్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని పేర్కొన్నారు. రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ నాగరాజు మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ అల్లాబక్షు, ఎంఈవో కే వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈఈ చంద్రశేఖర్, ఆర్అండ్‌బీ ఏఈఈ బాబు, ఏపీవో లక్ష్మీనారాయణ, వైద్యాధికారి శ్రీహరి, ఏఓ విజయభారతి, ఏపీఎం జమునారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పరిమళ తదితరులు పాల్గొన్నారు.

చెలరేగిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు



చోరీ జరిగిన ప్రదేశాలను పరిశీలిస్తున్న రైతులు

వాకాడు: మండలంలో రెండు వారాలుగా ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు చెలరేగిపోతున్నారు. మొన్న వాకాడు మండలం తిరుమూరులో 16 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. తాజాగా మంగళవారం రాత్రి కాశీపురంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేసి రాగి వైరు చోరీ చేశారు. దీంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. తాము వ్యయ ప్రయాసలకోర్చి సొంత నిధులతో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేసుకున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ దుండగులు చాకచక్యంగా తీగలను కత్తరించి ట్రాన్స్‌ఫార్మర్లను కిందకి దించి ధ్వంసం చేసి అందులో ఉన్న విలువైన రాగి వైరు, ఆయిల్‌ను చోరీ చేస్తున్నారని వాపోయారు. రబీ సీజన్ సాగుకు సన్నద్ధమవుతున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురికావడంతో ఏమి చేయాలో దిక్కుతోచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు నిఘా పెట్టి దుండగులను అరెస్టు చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురికాకుండా చూడాలని కోరుతున్నారు.

సరస్వతీ దేవీగా బాలా త్రిపుర సుందరీ దేవి







సైదాపురం : సరస్వతీదేవీ అలంకరణలో అమ్మవారు, రాపూరు : విద్యాలక్ష్మి అలంకరణలో ఆదిలక్ష్మీదేవి

సైదాపురం/రాపూరు/చిల్లకూరు/వాకాడు/చిట్టమూరు(వాకాడు)/నాయుడుపేట టౌన్/వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం అమ్మవార్లు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు.

- సైదాపురంలో వెలసిన శ్రీబాలా త్రిపురసుందరీదేవి అమ్మవారు బుధవారం సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రత్యేక హోమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.
- రాపూరు మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవి అమ్మవారు బుధవారం విద్యాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి స్నపన తిరుమంజనాన్ని ఘనంగా నిర్వహించారు. రాత్రి ఆదిలక్ష్మిగా అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చి క్షేత్రోత్సవం చేశారు. వేపినాపి సమీపంలోని అంకమ్మతల్లి సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు. రాపూరు గ్రామదేవత రాపూరమ్మ, కన్యకాపరమేశ్వరి అమ్మవార్లు సరస్వతిదేవి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు.
- చిల్లకూరు మండలంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మను ఉదయం నెమలి ఈకలతో అలంకరించారు. సాయంత్రం సరస్వతి దేవిగా అలంకరించి మాడ వీధుల్లో ఊరేగించారు. కలవకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మీ అమ్మవారు విద్యాలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు.
- వాకాడులో వెలసిన నాగార్పమ్మ బుధవారం సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.
- చిట్టమూరు మండలం మల్లాంలో వెలసిన మార్కేండేశ్వర స్వామి ఆలయంలోని కామాక్షిదేవి అమ్మవారు బుధవారం సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు గూడలి సుధీర్‌శర్మ విశేష అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు.
- నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ, మూకాంబికాదేవి, దుర్గామల్లేశ్వరిదేవి, కన్యకాపరమేశ్వరి అమ్మవార్లు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు.
- వెంకటగిరిలోని కర్ణమ్మవీధిలోని హరహర క్షేత్రంలోని కాత్యాయని, శ్రీదేవి అమ్మవార్లు, వెలమపాళెం సమీపంలో ఉన్న మందనాంచారమ్మ, కన్యకమాపరమేశ్వరి అమ్మవార్లు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

సరస్వతిగా చెంగాళమ్మ పరమేశ్వరి



సూళ్లూరుపేట: చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారు బుధవారం సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే యాగశాలలో మహా చండీ యాగాన్ని ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమాలకు నెల్లూరుకు చెందిన దువ్వూరు హరిప్రసాద్‌రెడ్డి, జ్యోతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. నెల్లూరుకు చెందిన పీజీ సరిత కళ్యాణ్ అండ్ స్టూడెంట్స్, అంతరిక్ష ఆర్ట్స్ సూళ్లూరుపేట, చెన్నై వారు నిర్వహించిన శాస్త్రీయ సంగీత, నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి.

చెంగాళమ్మ పరమేశ్వరికి ఘనంగా సారెల సమర్పణ

చెంగాళమ్మ పరమేశ్వరికి బుధవారం సాయినగర్, పరమేశ్వరినగర్, మహదేవయ్యనగర్, ఝాన్సీనగర్, సంజీవయ్యనగర్, ఇందిరానగర్ ప్రాంతాలకు చెందిన భక్తులు సారెలు సమర్పించారు. మహిళలు చీరలు, రవికెలు, పండ్లు తీసుకుని ఊరేగింపుగా వచ్చారు. వారికి ఆలయ సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మీ స్వాగతం పలికారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో వెంకటరమణ

రాపూరు: వార్డు సభ్యులు, ఉప సర్పంచులు గ్రామ పంచాయతీ పాలనతోపాటు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంపీడీవో దశరథరామిరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం వార్డు సభ్యులు, ఉప సర్పంచులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టి సారించాలి

సైదాపురం: ప్రజాప్రతినిధులు అధికారులతో సమన్వయం చేసుకుని అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఉప సర్పంచులు, వార్డు సభ్యులు గ్రామీణాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు.

మౌళిక వసతులు కల్పనకు కృషి చేయాలి

ఓజిలి: గ్రామ పంచాయతీల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో తాగునీరు, విద్యుత్ దీపాలు, రోడ్లు తదితరాలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. మూడు నెలలకోసారి సర్వసభ్య సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులపై చర్చించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ రవీంద్రబాబు, పంచాయతీ కార్యదర్శి రేణుక తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన ఉండాలి

చిల్లకూరు: ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పంచాయతీ రాజ్ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో గోపి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సభలో తీర్మానం చేసిన పనులనే చేయాలని సూచించారు. ఉపాధి హామీ కింద మంజూరైన నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ మాణిక్యం, ఉపాధి ఏపీవో గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిలతోనే పంచాయతీల అభివృద్ధి

గూడూరు రూరల్: ప్రణాళిలలతోనే గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చని డివిజన్ పంచాయతీ అధికారి వెంకటరమణ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉప సర్పంచులు, వార్డు, సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, అధికారులు సమన్వయంతో పని చేస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈవోపీఆర్డీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.